# నూతన మద్య విధానానికి వ్యతిరేకంగా కదంతొక్కుతున్న మహిళలు

**ఆంధ్రప్రదేశ్** రాష్ట్ర ప్రభుత్వ నూతన మద్య విధానానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు పెల్లుబుకుతున్నాయి. దాదాపు అన్ని జిల్లాలోను మహిళా సంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు, స్థానిక మహిళలు, వివిధ పాఠశాలల సిబ్బంది, విద్యార్థులు, మసీదులకు చెందిన పెద్దలు, యువజనసంఘాలు ఈ నిరసన కార్యక్రమాలలో పాల్గొంటున్నారు. నివాస ప్రదేశాల మధ్య మద్యంషాపులు పెట్టటాన్ని వారు తీవ్రంగా అభ్యంతరం తెలియజేశారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు, ఏలూరు, రాజమండ్రి, శ్రీకాకుళం, కడప, కర్నూలు, అనంతపురం వంటి ముఖ్య నగరాలలోనేకాక జిల్లాలలోని అనేక పట్టణాలలో, గ్రామాల్లో సైతం ఈ నిరసనలు కొనసాగాయి, కొనసాగుతున్నాయి. ధర్నాలు, రాస్తారోకోలు, కొవ్వొత్తుల ప్రదర్శనలు, సంతకాల సేకరణలు, దీక్షలు, చీపుర్లతో నిరసన, మద్యం షాపులకు తాళాలు వేయటం, షాపులలోని మద్యం సీసాలను ధ్వంసం చేయటం వంటి అనేక రూపాలలో ఆందోళనలు కొనసాగుతున్నాయి. అనంతపురంజిల్లా గుత్తిలో నిరసనకారులు షాపు యజమానుల చేతిలో రాళ్ళ దాడికి గురయ్యారు కూడా.

మహిళల ఈ ఆగ్రహావేశాలలో న్యాయం ఉంది. 2014 ఎన్నికల ప్రచారంలో పాదయాత్ర సందర్భంగా చంద్రబాబునాయుడు విడతలవారీగా మద్యనిషేధాన్ని అమలుచేస్తానని, బెల్టుషాపులు రద్దుచేస్తానని హామీలిచ్చాడు. అన్ని ఎన్నికల హామీల్లాగే అవికూడా నీటిమీద రాతలయ్యాయి. టిడిపి అధికారంలోకి వచ్చాక ఒక్క బెల్టుషాపు కూడా మూతపడకపోగా ఇళ్ళ మధ్యలోకి షాపులు చొచ్చుకురావటం మహిళల ఆగ్రహావేశాలకు కారణంగా ఉంది. అధికారంలోకి రావటానికి ప్రతి రాజకీయపార్టీ ఎన్నికలకు ముందు మద్యనిషేధం విధిస్తామని హామీలివ్వటం, ఆనక మద్యం వ్యాపారాన్నే ఆదాయ వనరుగా చేసుకోవటం పరిపాటిగా మారింది. తమకు విధేయులైన అనుచరగణానికి వీటిని కట్టబెట్టి వారు ఆదాయాలు దండుకునేవిధంగా చూడటమే పాలకులకు పరమ ప్రయోజనంగా మారింది. రాష్ట్రంలోని మద్యం వ్యాపారులు అధికభాగం సిండికేట్లుగా ఏర్పడి షాపులను చేజిక్కించుకుంటున్నారు. ఈ సిండికేట్లకు వెన్నుదన్నుగా పాలక రాజకీయ పార్టీలున్నాయన్నది జగమెరిగిన సత్యం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నూతన మద్య విధానం 2017 జులై 1 నుండి ప్రారంభమయ్యింది. ఇది రెండు సంవత్సరాలపాటు అమలులో ఉండి జూన్ 30 2019న ముగుస్తుంది. ఈ విధానంలో 4380 మద్యం దుకాణాలకు, 833 బార్లకు అనుమతినిచ్చారు. గత డిసెంబరులో సుప్రీంకోర్టు జాతీయ రహదారులకు 500 మీటర్లలోపున, రాష్ట్ర రహదారులకు 250 మీటర్లలోపున మద్యం దుకాణాలకు, బార్లకు లైసెన్సులీయరాదని రాష్ట్ర ప్రభుత్వాలనాదేశించింది. దీనిపై అనేక రాష్ట్ర ప్రభుత్వాలు నగరాలగుండా, పట్టణాలగుండా వెళ్ళే జాతీయ రహదారులను డీ నోటిఫై చేయాలని కోరగా, ఆ మేరకు సుప్రీంకోర్టు తన తీర్పును తానే వెనక్కు తీసుకుంటూ మరోసారి న్యాయవ్యవస్థ భ్రష్టత్వాన్ని కళ్ళకు కట్టింది. రాష్ట్ర ప్రభుత్వం మరో అడుగు ముందుకువేసి పట్టణాలగుండా వెళ్ళే రాష్ట్ర రహదారులను అర్బన్ రోడ్లుగా ప్రకటించి తన డొంకతిరుగుడుతనాన్ని మరోసారి ప్రదర్శించింది. వీటన్నింటి నేపథ్యంలో నూతన మద్య విధానంలో మద్యం దుకాణాలు ఇళ్ళ మధ్యకు చొచ్చుకువచ్చి మహిళల ఆగ్రహావేశాలకు కారణమయ్యాయి.

రాష్ట్ర ఎక్సైజు శాఖామంత్రి కె.ఎస్.జవహర్ నూతన మద్య విధానాన్ని ప్రకటిస్తూ మద్యం షాపులు పెట్టడంలో ఏమైనా అభ్యంతరాలుంటే తనను సంప్రదించ వచ్చునంటూ తన ఫోన్ నెంబర్ ఇస్తే పది రోజులలో 4600 కాల్స్ వచ్చాయి. సమస్య తీవ్రతను గుర్తించాల్సింది పోయి, వాటిలో ఎక్కువభాగం ప్రతిపక్షపార్టీలు కావాలని చేసిన కాల్స్‌గా ఆయన వ్యాఖ్యానించాడు. ఇదే మంత్రి ఒక టివి చర్చా వేదికలో బీరును హెల్త్ డ్రింకుగా అభివర్ణించాడు. మరోవైపు పర్యాటక ప్రదేశాలలోను, బీచ్‌లలోను 'రెడీ టు డ్రింక్' పేరిట బీచ్ షాప్స్, బీర్ పార్లర్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. వీటి నిర్వహించుకోవటానికి ఎవరైనా దరఖాస్తు చేసుకుంటే వెంటనే అనుమతి మంజూరుచేసేలా జీవోలో సంవరణలు కూడా తీసుకువచ్చారు. ప్రజలను మత్తులో ముంచటమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని దీని ద్వారా స్పష్టమవుతున్నది.

ప్రభుత్వానికి ఆదాయ వనరుగా ఉండటమొక్కటే మద్యం యొక్క పరమ ప్రయోజనం కాదు. రాజకీయ నాయకుల అనుచరగణాలు వీటిద్వారా ఆదాయాలను పెంచుకోవటం ఒక లక్ష్యం మాత్రమే. ఎన్నికలలో ఓట్లు వేయించుకోవటానికి, తమ వెనుక ముఠాలను తిప్పుకోవటానికి దీన్నొక ముఖ్య సాధనంగా వినియోగించటం మాత్రమేకాక, శ్రామికవర్గం తన ఆర్థికస్థాయిని, సాంస్కృతికస్థాయిని పెంచుకోకుండా చూడటమే పాలకులకు అన్నిటికన్నా ముఖ్యమైన విషయం. భవిష్యత్తుకు ఏమాత్రం భద్రతలేని స్థితిలో శ్రామికవర్గం ఉంటేనే వాళ్ళు దోపిడీవర్గాలకు చౌక కూలీలుగా లభ్యమౌతారనే అత్యంత ప్రాథమిక మార్క్సిస్టు సూత్రమే ఇందులో ఇమిడి ఉంది. శ్రామికవర్గ పురుషుల ఆదాయం దాదాపుగా మద్యం దుకాణాలకే తరలిపోతుంటే మహిళల అస్తుబిస్తు ఆదాయాలతోనే మెజారిటీ కుటుంబాలు మనుగడ సాగిస్తున్నాయనేది ఒక కఠిన వాస్తవం. సరియైన చదువు లేక, ఉన్న చదువులకు ఉద్యోగాలు లేక, భవిష్యత్తు అంధకార బంధురంగా కనిపిస్తున్న స్థితిలో శ్రామికవర్గపు యువత లంపెన్‌గా మారి దోపిడీ పాలకుల వెనుక ముఠాలుగా తిరుగుతున్నారు. వారిని మద్యానికి బానిసలుగా చేస్తున్నది దోపిడీ పాలకులే. ఈ మద్యం మత్తు మహిళలపై అరాచకాలు అధికం కావటానికి, నేరాలు పెరగటానికి, రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణంగానూ ఉందని పలు ప్రభుత్వ నివేదికలే వెల్లడి చేస్తున్నాయి. అయిన ఈ ప్రభుత్వాలు మద్యం వ్యాపారాన్ని అరికట్టకపోగా దీనిపై ఆదాయాలను ప్రతి ఏడాదీ పెంచుకుంటూ పోతూండటం పాలక ప్రభుత్వాల ఉద్దేశ్యాలను తేటతెల్లం చేస్తున్నాయి.

మద్యంపై వ్యక్తమౌతున్న మహిళల వ్యతిరేకత హర్షణీయం – మద్యం షాపులపై మహిళల ధర్మాగ్రహం సమర్థనీయం. అయితే మద్యాన్ని ఆదాయ వనరుగా మాత్రమేగాక, ప్రజల్ని రాజకీయంగా, సాంస్కృతికంగా నైతికంగా దిగజార్చే ఆయుధంగా పాలకులు ప్రయోగిస్తున్నారని గుర్తెరగాలి. మద్యం ఉత్పత్తి, వ్యాపారాలను ప్రభుత్వం ఆపివేయాలని డిమాండ్ చేస్తూ సమైక్యంగా ఆందోళన సాగించాలి.